ప్రజాశక్తి

సోమవారం 25 సెప్టెంబర్ 2023   8 పేజీలు





ప్రకాశం   బాపట్ల



ఫారం 7 దరఖాస్తులను విచారిస్తున్న పర్చూరు తహశీల్దారు సంధ్యశ్రీ

ఫారం7 దరఖాస్తుల లొల్లి

- ఓటరు జాబితా రీసర్వేతో ఒత్తిడికి గురవుతున్న అధికారులు
- పర్చూరులో 8,396 ఓట్లు తొలగింపు కోసం దరఖాస్తులు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఓటరు సర్వేలో భాగంగా ఓట్ల తొలగింపు కోసం జిల్లాలో ఫారం 7 దరఖాస్తులు 30 వేలు వచ్చాయి. పర్చూరు నియోజవర్గంలోనే 13 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. 2013 నుంచి 2019 వరకూ టిడిపి నేతల ప్రోద్బలంతో పర్చూరు నియోజకవర్గంలో భారీగా దొంగ ఓట్లు నమోదు అయ్యాయని భావిస్తున్న అధికార పార్టీ నేతలు గ్రామాల్లో ఉన్న అనుచరుల ద్వారా ఫారం 7 దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా చేయించారు. ఒక వ్యక్తి 5 దరఖాస్తులు ఇవ్వవచ్చుననే నిబంధనలు ఉన్నాయి. అయితే ఒకే వ్యక్తి నుంచి వందల దరఖాస్తులు వచ్చాయి. 20కి పైగా ఫారం 7లు ఇచ్చిన వారు 124 మంది ఉన్నారు. వీరి ద్వారానే ఓట్ల తొలగింపు కోసం 8,396 దరఖాస్తులు వచ్చాయి.

పర్చూరు నియోజకవర్గంలోని దరఖాస్తులను పరిశీలిస్తే. మార్టూరు నుంచి షేక్ మొహమ్మద్ రఫీ పేరుతో 202, షేక్ బుడే పేరుతో 125,తమ్మిశెట్టి శ్రీనివాసరావు పేరుతో166 దరఖాస్తులు వచ్చాయి. అనంతవరంలో షేక్ శ్రీనివాసరావు పేరుతో 208, అన్నంబొట్లవారిపాలెంలో ▶ 2లో

పెరుగుతోన్న రాజకీయ వేడి

- టిడిపి కార్యకర్తలపై కేసులతో నిర్బంధం
- గ్రామాల్లో వైసిపి-టిడిపి గ్రూపుల మధ్య పెరుగుతున్న వైరం
- చంద్రబాబు అరెస్టు అనంతర పరిణామాలపైనే చర్చంతా

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

చంద్రబాబు అరెస్టు... రిమాండ్...పరిణామాలు జిల్లాలో రాజకీయ వాతావరణాన్ని వేడెక్కించాయి. పార్టీల ఎజండాలే మారిపోయాయి. ఓవైపు ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీలు అందుకు సిద్ధమవుతోన్న తరుణంలో టిడిపి అధినేత చంద్రబాబును జైలులో పెట్టడం ఆ పార్టీనేతలు ఇపుడు కొత్త తరహా ఆందోళనలకు దిగాల్సి వచ్చింది. అన్ని వైపుల నుంచి నిలబడాల్సి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ కక్షతోనే టిడిపి అధినేత చంద్రబాబుపై కేసులు పెట్టినట్లు సోషల్ మీడియాలో టిడిపి అభిమానులు దుమారం రేపుతున్నారు. రానురాను ఈ వ్యవహారంలో కేంద్రం పాత్రే ఎక్కువగా ఉందనే చర్చ ముందుకొచ్చింది. ఏదేమైనా రాజకీయాల్లో చంద్రబాబు వ్యవహారమే ఇపుడు హాట్‌టాపిక్‌గా మారింది.చంద్రబాబు అరెస్టు తర్వాత తెలుగుదేశం శ్రేణులు పోరాటాలకు దిగారు. నిరసనలు వివిధ రూపాల్లో వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం దీక్షలు కొన సాగుతున్నాయి. వీటిల్లో పాల్గొనే కార్యకర్తలపై కేసులు బనాయిస్తున్నారని టిడిపి ఎమ్మెల్యేలు భగ్గుమంటున్నారు. వీటిని ఎదుర్కోవడం ఇపుడు వారికిసవాలుగా మారింది. ఈ కేసుల ఆధారంగానే రౌడీ షీట్లు తెరిచి రేపు ఎన్నికల్లో బయట తిరగనివ్వకుండా చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు ఆదేశాలు ఇచ్చిందని టిడిపి నేతలు భావిస్తున్నారు. న్యాయపోరాటంతోనే ఈ కేసులను ఎదుర్కోవాలని నిర్ణయించారు. ఉమ్మడి పార్టీ నేతలు భేటీలో పార్టీ భవిష్యత్ కార్యక్రమాలను వెల్లడించారు.ఓ వైపు తమ నేత బయటకు వచ్చే మార్గాలపై ఉత్కంఠ పరిస్థితులు పార్టీలో ఉన్నాయి. మరోవైపు ఎన్నికలు సమీపిస్తున్నందున వాటికి తగ్గ ఏర్పాట్లులో ఉండాలి. మరోవైపు దొంగోట్ల వ్యవహారం కొనసాగుతోంది. వీటన్నిటిని ఎదుర్కోవడం ఇపుడు ఏకకాలంలో జరగాల్సి ఉంది. టిడిపిని ఇలా ఇరుకున పెట్టడమే ప్రస్తుత పాలకపక్షం వ్యూహంగానే ఉంది. అందుకు కేంద్రం సహకారం ఉండటంతో అన్నీ కలిసి వచ్చాయనే చర్చ సాగుతోంది. ఇక ఈ పరిణామాలు గ్రామాల్లో తెలుగుదేశం- వైసిపి వర్గాల మధ్య వైరం పెంచుతున్నాయి. కేసులు పెట్టడంతో గ్రామాల్లో రాజకీయంగా ఇరు వర్గాల మధ్య ఉద్రిక్తతలు పెరుగు తున్నాయి. వైసిపి ఎమ్మెల్యేల వత్తిళ్లతోనే కేసులు పెడుతున్నారని టిడిపి నేతలు భావిస్తున్నారు. ఒంగోలులో ర్యాలీలో పాల్గొన్న నేతలను అరెస్టు చేసి వారిపై నాన్‌బెయిల్‌బుల్ కేసులు బనాయించారు. పలుచోట్ల ఇవే జరుగుతున్నాయి. వీటి వల్ల గ్రామాల్లో శాంతిభద్రతలకు ముప్పు వస్తోంది. రేపు అధికార మారాక మీ సంగతి తేల్చుతామంటూ హెచ్చరికలు చేసుకుంటున్నారు. ఇవి పరిణామాలకు ▶ 2లో

విద్యుత్తు ఛార్జీలపెంపునకు వ్యతిరేకంగా ..

27న కలెక్టరేట్ వద్ద ధర్నా

- జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నేతల పిలుపు
- విద్యుత్తు ఛార్జీలు తగ్గించకపోతే మరో ఉద్యమం తప్పదని హెచ్చరిక



మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నేతలు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పెంచిన విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని కోరుతూ ఈనెల 27న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వామపక్ష పార్టీల నేతలు తెలిపారు. ప్రకాశం కలెక్టర్ కార్యాలయం వద్ద కూడా ధర్నా జరుగుతోందని తెలిపారు. ఈ ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వామపక్ష పార్టీల నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ పెంచిన విద్యుత్తు ఛార్జీల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల మీద ఏ మాత్రం సానుభూతి లేకుండా ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల వ్యవసాయం దెబ్బతింటుందన్నారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును బిజెపి పాలిత రాష్ట్రాలే వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సంస్కరణల పేరుతో మన రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఉత్సాహం చూపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్తు ఛార్జీలు పెరగడంతో చిన్న పరిశ్రమలు మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. అనేక కంపెనీలు మూత పడుతున్నాయని చెప్పారు. ఫలితంగా అనేక మంది కార్మికులు ఉపాధిలేక అల్లాడిపోయే పరిస్థితి నెలకొని ఉందని వివరించారు. సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలను హింసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్తు ఛార్జీలను ఉపసంహరించకోకుంటే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్తు ఉద్యమం మరోసారి పునరావృతం అవుతోందని హెచ్చరించారు. ఈనెల 27న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్. నారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అప్పుల కోసం జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో విద్యుత్తు సంస్కరణలు అమలు చేసేందుకు ▶ 2లో

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం

నేడు చలో విజయవాడ

- వంట నిర్వాహణకు ఆర్థిక భారం
- పేరుకు పోతున్న కూరగాయలు, టిఎ, డిఎ బిల్లుల బకాయిలు
- పట్టించుకోని అధికారులు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శిశు సంరక్షణ, పోషణ, గర్భిణులు, బాలింతల సంరక్షణ అంగన్‌వాడీల వాస్తవ బాధ్యత. వారికి ప్రభుత్వం సమకూర్చే పౌష్టికాహారం సక్రమంగా అందించడమే ఆ బాధ్యత. మన కన్న బిడ్డలకు తల్లుల్లా సేవలు చేసేది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు. క్షేత్ర స్థాయిలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యకలాపాలు ముందుకు సాగుతున్నాయంటే వీరి విశేష సేవలే నిదర్శనం. పిల్లల సేవలకు అంకితం కానీయకుండా అంగన్‌వాడీ తల్లులపై మానసిక ఒత్తిడిని పెంచేలా యాప్స్, సర్వేల పేరుతో పనిభారం మోపుతూ నానా ఇబ్బందులకు గురి చేస్తున్నాయి ప్రభుత్వాలు. వీటికి తోడు ఆర్థికంగా ఇబ్బందులు పెట్టి మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నేడు చలో విజయవాడకు పిలుపునిచ్చారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో..

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా టేక్ హోం రేషన్ పేరుతో లబ్ధిదారుల ఇంటికే సరుకులు చేర్చాలనే నిబంధనలు ఇటీవల తీసుకొచ్చింది. చిన్నారులకు, గర్భిణులు వంట చేసి వడ్డించాలని ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటి వరకూ ఉన్న ఇబ్బందులకు తోడు ఈ విధానం అంగన్‌వాడీలను మరిన్ని ఇబ్బందుల్లోకి నెడుతోంది. చిన్నారులకు, గర్భిణులకు వంట చేయాలంటే అవసరమైన కూరగాయలు వీరే కొనుగోలు చేసుకోవాలి. దీంతో చాలీచాలని వేతనాలతో బతుకుబండిని లాక్కొస్తున్న వీరి పరిస్థితి ఆర్థికంగా మరిన్ని ఇబ్బందుల్లోకి నెట్టుతోంది. అప్పో సొప్పో చేసి కొనుగోలు చేసి చిన్నారులకు, గర్భిణులకు వంట చేసి వడ్డించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. కూరగాయలకు సంబంధించిన బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడంతో అంగన్‌వాడీలకు ఆర్థిక భారంగా మారింది. జిల్లాలోని 13 ప్రాజెక్టుల పరిధిలో 2903 మెయిన్, 227 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో 2596 మంది అంగన్ వాడీలు, 2548 మంది ఆయాలు, 227 మంది మినీ కార్యకర్తలు 227 విధులు ▶ 2లో

పెరుగుతోన్న రాజకీయ వేడి

(మొదటి పేజీ తరువాయి)

పరిణామాలకు దారితీస్తాయో కూడా చూడాలి. ప్రతికారేచ్ఛలతో రగిలిపోతున్నారు. ఎన్నికల్లోనే ఇవన్నీ తీవ్ర ప్రభావం చూపేలా కనిపిస్తున్నాయి. సమస్యాత్మక గ్రామాల సంఖ్య కూడా పెరిగే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో రాజకీయ సమీకరణల్లో మార్పులు కూడా చర్చకు దారి తీస్తున్నాయి. తెలుగుదేశంతో కలిసి ఎన్నికల్లో పోటీచేస్తామని జనసేన ప్రకటించింది. దీంతో ఇక్కడ బలాబలాల్లో వచ్చే మార్పులపైనే చర్చ సాగుతోంది. ఎవరి అంచనాల్లో వారున్నారు. జనసేన వల్ల వైసిపికి గతంతో పోలిస్తే నష్టం ఎంతైనా తప్పదని సుస్పష్టం. వైసిపిలోనూ పరిస్థితులు అనుకున్నంత సఖ్యతగా లేవు. ఎమ్మెల్యేలపై ద్వితీయశ్రేణి నేతలు కాలు దువ్వుతున్నారు. టిక్కెట్టు ఇవ్వద్దని హెచ్చరిస్తున్నారు. పార్టీ అగ్రనేత విజయ సాయిరెడ్డి ఎదుటే ఈ విషయం చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో నియోజకవర్గాల్లోనూ పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయి. గిద్దలూరు జడ్‌పిటిసి మధుసూధన్‌యాదవ్ ఆదివారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వైసిపికి ఈ పరిణామం షాక్ నిచ్చింది. అక్కడున్న పరిస్థితులే ఇందుకు అద్దం పడుతున్నాయి. పార్టీ ఫిరాయింపుల పైనా దృష్టిసారించారు. ఎన్నికలకోసం రాజకీయ క్రీడలు మొదలయ్యాయి. ఏదేమైనా చంద్రబాబు అరెస్టు అనంతర పరిణామాలు రాజకీయంగా గ్రామాల్లో ఇరుపార్టీల నడుమ ప్రచ్ఛన్న యుద్ధానికి తెరలేపాయి.

ఫారం 7 దరఖాస్తుల లొల్లి

(మొదటిపేజీ తరువాయి)

గోరంట్ల శివకుమారి పేరుతో 291,బూదవాడ నుంచి కూరాకు ఇసాక్ బాబు పేరుతో 130, జంగా ఎలీషా బాబు పేరుతో 114, దేవరపల్లి గ్రామం తోకల కృష్ణమోహన్ పేరుతో 145, దుద్దుకూరులో నల్లూరు మారుతి రావు 154, గంగవరంలో కీసర వెంకటేశ్వర్‌రెడ్డి పేరుతో 168, యద్దనపూడి నుంచి జాగర్లమూడి శ్రీనివాసరావు 207,ఎం. అంకినీడు 144, బి శ్రీనివాసరావు 108, వలి పేరుతో 117 దరఖాస్తులు వచ్చాయి.

ఫారం 7 దరఖాస్తులపై రెవెన్యూ అధికారులు బృందాలుగా విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా ఫారం 7 దరఖాస్తు చేసిన వారిని విచారిస్తే వారిలో కొందరు తమకు తెలియదంటున్నారు. ఫారం 7 ద్వారా ఓటు తొలగించాలని తాము దరఖాస్తు చేయలేదంటున్నారు. దరఖాస్తు చేసిన వారిలో కొందరు విచారణకు రాకపోవడంతో రెవెన్యూ అధికారులు వారి నోటీసులు ఇస్తున్నారు. కొందరు ఓటర్లు కుటుంబజీవనం పనుల కోసం తాము ఇతర ప్రాంతాల్లో ఉంటున్నామని చెబుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలు పోక అధికారులు ఒత్తిడికి లోనవుతున్నారు.

ఎన్నికల మార్గదర్శకాలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న అధికారులపై విచారణ జరిపి తగుచర్యలు తీసుకోవాలని టిడిపి ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్ ,డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను ఇటీవల కలిసి వినతిపత్రం అందజేశారు. పర్చూరు నియోజకవర్గ వ్యాప్తంగా కొందరు అక్రమార్కులు కావాలనే ఏకమొత్తంలో ఫారం 7 దరఖాస్తులు చేశారని ఎవరి ఓట్లు వాళ్లే తొలగించమని వందల సంఖ్యలో దరఖాస్తులు చేసినట్లు కొందరు అక్రమార్కులు దరఖాస్తు చేశారని, వాటిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అదే రోజున వైసిపి పర్చూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ కూడా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మీనాను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజాప్రాతినిధ్యచట్టం సెక్షన్ 19బి, 20 ప్రకారం పుట్టిన ప్రదేశం కాకుండా సాధారణ నివాసం ఎక్కడ ఉంటే అక్కడే ఓటు ఉండాలి అనే నిబంధన మరియు సాధారణ నివాసం నిబంధనలు ఆర్‌పి యాక్ట్‌లో పొందుపరచబడ్డాయని తెలిపారు. దాని ప్రకారం స్థానికంగా ఉన్న వారికే ఇక్కడ ఓటు హక్కు ఉంటుందని తెలిపారు. తమ ఓటు ఎక్కడ ఉంచుకోవాలనేది తమ ఇష్టమని, తాము తమ స్వగ్రామంలోనే ఓటు ఉంచుకుంటామని, తాము ఫారం 7 దరఖాస్తు చేయలేదని ఓటర్లు చెబుతున్నారు.

విద్యుత్తు ఛార్జీల పెంపునకు వ్యతిరేకంగా..

27న కలెక్టరేట్ ఎదుట ధర్నా

(మొదటిపేజీ తరువాయి)

ముందుకు వచ్చారని చెప్పారు. అప్పట్లో వైఎస్ఆర్ వ్యవసాయానికి అమలు చేసిన ఉచిత విద్యుత్తుకు మంగళం పాడిన ఘనత కూడా జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. కరెంటు బిల్లులు పెరగడంతో సామాన్యులు విలవిలలాడుతున్నారని తెలిపారు. రూ. 100, రూ.200 వచ్చే కరెంటు బిల్లు ఇప్పుడు రూ.400, రూ.600 వరకూ వస్తోందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు కూడా ప్రజల నుంచే రాబడుతున్నారని విమర్శించారు. విద్యుత్తు ఛార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఈనెల 27న కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్.స్వామి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆదేశాలతో అప్పుకోసం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్తు ఛార్జీలు పెంచారని విమర్శించారు. ఆదానికి ప్రజల సంపదను దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ ఎంఎల్ (న్యూడెమొక్రసీ) నాయకులు ఎంఎస్.సాయి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ప్రతిపక్షంలో చెప్పిన దానికి నేడు చేసే దానికి పొంతన లేదని వివరించారు. ప్రజలు అబద్దాలను నమ్మే పరిస్థితి లేదన్నారు. అనంతరం విద్యుత్తు ఛార్జీలను వ్యతిరేకిస్తూ ఈనెల 27 నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచురించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్.చౌదరి, సిపిఐ ఎంఎల్ నాయకురాలు లలితకుమారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం..

నేడు చలో విజయవాడ నిర్వహిస్తున్నారు. వీరంతా తమ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పాలు, గుడ్లతో పాటు అదనపు పౌష్టికాహారాన్ని అందిస్తారు. గత నెల నుంచి బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్ కింద ఇంటి వద్దకే పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నారు. చిన్నారులకు మాత్రం కూర గాయలు కొనుగోలు చేసి కేంద్రాల్లోనే పదార్థాలను వండాల్సి ఉంది.

ఐదారు నెలలకోసారి కూరగాయల బిల్లులు చెల్లిస్తుండడంతో అప్పులు చేయాల్సి వస్తుందని అంగన్‌వాడీలు వాపోతున్నారు. ఈ ఏడాది మార్చి వరకూ బిల్లులు చెల్లించారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి బకాయిలు చెల్లించలేదు. దీంతో అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారు.

డిమాండ్లు ఇవీ..

అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు మంజూరు చేయాలి. సుప్రీంకోర్టు గ్రాట్యూటీ ఇంప్లిమెంట్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం గుజరాత్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు గ్రాట్యూటీ అమలవుతుంది. మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలి. ఉద్యోగ విరమణ అనంతరం పెన్షను మంజూరు చేయాలి. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలి. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఏ, డిఏ బిల్లులు మంజూరు చేయాలి. అంగన్‌వాడీలకు పనిభారం తగ్గించాలి. నాణ్యమైన స్మార్ట్ ఫోన్లు అందజేయాలి. ప్రీ స్కూల్‌కు అందజేసే సరుకులు నాణ్యమైనవి ఇవ్వాలి. విధుల నిర్వాహణలో చనిపోయిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి. తెలంగాణ తరహాలో ఉద్యోగ విరమణ చేసిన కార్యకర్తకు రూ. లక్ష, ఆయాకు రూ. 50 వేల చొప్పున మంజూరు చేయాలి.

చలో విజయవాడను జయప్రదం చేయండి

ఈదర అన్నపూర్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్



అంగన్‌వాడీల నాణ్యమైన డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సంఘం రాష్ట్ర కమిటీ చలో విజయవాడకు పిలుపు నిచ్చింది. జిల్లాలోని అంగన్‌వాడీలంతా అధిక సంఖ్యలో విజయవాడకు తరలిరావాలి. నాణ్యమైన డిమాండ్లు పరిష్కరించుకునేందుకు పోరాడుదాం. పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్లు తప్ప అన్న కారల్ మార్క్స్ మనకు ఆదర్శమని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

రేఖా ఎలిజిబెత్, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి



బాపట్ల జిల్లా: వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం నేడు నిర్వహిస్తున్న చలో విజయవాడకు అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున తరలి రావాలని ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా ఎలిజిబెత్ పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు,హెల్పర్లతో దశాబ్దాలుగా తక్కువ గౌరవ వేతనంతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు తెలిపారు. వేతనాల పెంపు కోసం అనేకసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. తెలంగాణ కన్నా రూ 1000 ఎక్కువగా వేతనం ఇస్తానన్న ముఖ్యమంత్రి హామీ అమలుకు నోచలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో పలు రకాల యాప్‌లను తెచ్చి మానసిక ఒత్తిడులకు గురిచేస్తున్నారన్నారు. రాజకీయ వేధింపులు ఎక్కువ అయ్యాయని తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించకుండా పోలీసుల ద్వారా నోటీసులు ఇవ్వడం, నిర్బంధించడం, అక్రమ అరెస్టులకు పూనుకోవడం సరికాదన్నారు. తక్షణం అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు.



లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార దృశ్యం

ఎలైట్ సిటిజన్స్ క్లబ్ నూతన కమిటీ ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు: ఒంగోలు పట్టణంలోని హోటల్ ఆస్టోనాలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు ఎలైట్ సిటిజన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా పట్టణంలోని ప్రముఖ స్వీట్ షాప్ అధినేత సొల్లేటి వెంకట్, కార్యదర్శిగా బచ్చు సురేష్ కుమార్, కోశాధికారిగా గ్రంధి పార్థసారథి ఎంపికయ్యారు. క్లబ్బు మాజీ గవర్నర్ విజయ్‌చంద్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే క్లబ్బులో కొత్తగా ప్రవేశిస్తున్న నూతన సభ్యులచే మల్టిపుల్ సెక్రటరీ బాలస్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సొల్లేటి వెంకట్ మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో క్లబ్బు ద్వారా మంచి సేవా కార్యక్రమాలు నిర్వహించి క్లబ్బును కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో ముందుకు తీసుకెళ్లానని అన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి గవర్నర్ గోపీచంద్, రెండో గవర్నర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సిద్ద సురేష్, క్లబ్ ఫౌండర్ కూరపాటి రమేష్, క్లబ్బు పూర్వపు అధ్యక్షులు పల్లపు సుబ్బయ్య, తమ్మినేని ఆంజనేయులు, పచ్చిశెట్టి జనార్ధన్, క్లబ్ సభ్యులు నైనాల రామకృష్ణ, పువ్వాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇంకొల్లులో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పారిశుధ్యంపై దృష్టి సారించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లులో పారిశుధ్యంపై దృష్టి సారించాలని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఇంకొల్లులో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ముస్లిం కాలనీలో డ్రైనేజీ వ్యవస్థను ఆయన పరిశీలించారు. వర్షం వస్తే పూర్తిగా ఇళ్లలోకి నీరు చేరుతోందని కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. తొలుత ఇంకొల్లులో ఓ చాయ్‌కేఫ్‌ను ఆయన ప్రారంభించారు. ఆయన వెంట నాయకులు, అభిమానులు ఉన్నారు.

గోవా మద్యం పట్టివేత

- రూ.9 లక్షల విలువైన 40 కేసులు స్వాధీనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

గోవా నుంచి అక్రమంగా తీసుకొచ్చి మద్యం వ్యక్తులను పట్టుకొని అరెస్టు చేసి వారి వద్ద ఉన్న 40 మద్యం కేసులను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం సుధీర్‌బాబు ఆదివారం రాత్రి విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. కే బిట్రగుంట గ్రామంలో నివాసముంటున్న మాధవి అనే మహిళ గోవా నుంచి మద్యాన్ని తెప్పించి అమ్ముతుందని సమాచారం తెలుసుకున్న సింగరాయకొండ సెబ్ ఎస్ఐ దయాకర్ నిఘా పెట్టారని, గోవా నుంచి మద్యం వస్తున్నట్లు నిర్ధారించుకున్నారు. పూర్తిస్థాయిలో నిఘా పెట్టగా తణుకు నుంచి కారులో పాపి నాయుడు, బాలాజీ అనే వ్యక్తులు గోవా మద్యం తీసుకొని వస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. మాధవి నివాసంపై దాడులు చేయగా అక్కడ కూడా నిల్వ ఉన్నది మొత్తం స్వాధీనం చేసుకోగా 40 కేసులు గోవా మద్యం దొరికిందని వివరించారు. మాధవితోపాటు ఉమా మహేష్, రవి అనే వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నామన్నారు. మహిళతోపాటు నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద 40 కేసులు గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. 1087 బాటిల్స్ దొరకగా వాటి విలువ సుమారు 9 లక్షల రూపాయలు ఉంటాయని ఆయన వివరించారు. వీటితోపాటు కారు స్కూటీని కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో సిఐ బి లత, సెబ్ ఎస్ఐ దయాకర్, ఎస్ఐలు ఎస్ శ్రీనివాసులు, గోపాలకృష్ణ, సిబ్బంది కె వెంకటరావు, బాలాజీ రావు, వివిఎస్ ప్రసాద్, మీరావలి, నాగరాజు, పి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సూపరింటెండెంట్

బిజెపి పాలన ఫలితం.. అంధకారంలో దేశం

ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు అనిల్

ప్రజాశక్తి-చీరాల

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పాలన వల్ల దేశం అంధకారంలో ఉందని, మోడీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపితేనే దేశానికి మంచి రోజులు వస్తాయని ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు అనిల్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ప్రజానాట్యమండలి బాపట్ల జిల్లా సమావేశం కోకన్వీనర్ పి కిరణ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలు మోపుతూ మతాల పేరుతో ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని అన్నారు. జనాల్ని చీల్చి విభజించు పాలించే పద్ధతి అమలు చేస్తున్నందున బిజెపిని గద్దె నుంచి దింపి ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధపడాలని అన్నారు. ఇందుకు గాను సిపిఎం ఆధ్వర్యంలో త్వరలో రాష్ట్ర బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దానిని దానిని జయప్రదం చేయాలని కోరారు. ఈ యాత్ర సందర్భంగా అక్టోబర్ 4 నుంచి 8వ తేదీ వరకు తాడేపల్లి, వడ్డేశ్వరం సుందరయ్య స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లో శిక్షణ శిబిరం జరుగుతుందని అన్నారు. కాబట్టి ఈ శిక్షణ శిబిరంలో కవులు, కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జి సుబ్బారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో మరుగున పడిన కళలను వెలికితీసి మానవత విలువలు కాపాడాలని, జానపద కళలను బతికించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టీ కృష్ణమోహన్, ప్రజానాట్యమండలి బాపట్ల జిల్లా కన్వీనర్ బొనిగల సుబ్బారావు, జిల్లా నాయకులు నాగరాజు, అయ్యప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-బాపట్ల

లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ ఆధ్వర్యంలో పట్టణంలో ఏవివి హై స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనుహ్య స్పందన లభించింది. నరాలు, గుండె, సాధారణ వైద్య నిపుణులు సుమారు 3 వందల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చీరాల, గుంటూరు లైఫ్ హాస్పిటల్స్ సౌజన్యంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కార్డియాలజీ వైద్యులు కమలాకర కొసరాజు, న్యూరాలజీ డి దుర్గాప్రసాద్, ఎముకలు, కీళ్ల వైద్యనిపుణులు సజ్జ చెన్నకేశవరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల టౌన్ అధ్యక్షులు శిఖరం ఫణి రాజసైన్, కార్యదర్శి వై ఉషారాణి, జి శివరామకృష్ణ, లయన్ అలపర్తి శ్రీనివాసరావు, క్యాంపు కమిటీ చైర్మన్ గోపాలం రఘుపతిరావు, యజ్ఞ నారాయణ, బివి సంగమేశ్వర శాస్త్రి, గుండ్రెడ్డి సత్యనారాయణ, వంకాయలపాటి హరిబాబు, లక్కాకుల వెంకటరావు, బి రాజేంద్రప్రసాద్, సిహెచ్ బాషా, రజనీకాంత్, ఇక్కుర్తి శ్రీనివాసరావు, వివి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వాడరేవు ఆశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

ప్రజశక్తి-చీరాల

వాడరేవు రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత షుగరు వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 493 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. పరీక్షలు చేయించుకున్న వారికి నెల రోజులకు సరిపడు మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన వారికి అల్పారం ఏర్పాటు చేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. కేవలం మందులపైనే ఆధారపడకుండా ఆహార అలవాట్లు, జీవనశైలి మార్చుకోవాలని డాక్టర్లు సూచించారు. రోజువారీ జీవనంలో వ్యాయామం చేయాలని చెప్పారు. నడకతోపాటు తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. క్యాంపులో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలారాజేశ్వరి, డాక్టర్ లలిత్‌ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ సుధాకర్ యాదవ్ వైద్యపరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, ఎ సురేష్, ఎంజి శంకరరావు, గోపాల్, కుమార్, మూర్తి రోగులకు ఆహారం, తాగునీటి వసతుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ప్రజలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చీమకుర్తి: ప్రకాశం డిస్ట్రిక్ట్ డాడ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు పాల్గొనే విద్యార్థులను ఎంపిక చేశారు. అక్టోబర్ 1,2 తేదీలల్లో బాపట్ల జిల్లా చిలుముకూరులో జరిగే రాష్ట్రస్థాయి డాల్‌బాల్ పోటీలలో పాల్గొనే విద్యా ర్థుల ఎంపిక ఆదివారం స్థానిక నారాయణ పాఠశాల గ్రౌండ్‌లో జరిగాయి. పోటీలలో జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థుల వివరాలను అసోసియేషన్ కార్యదర్శి మోరబోయిన సుబ్బారావు ప్రకటించారు. బాలుర విభాగంలో మండవ రిత్విక్, బాలాజీ రాజు, విశ్వసాయి, వీరదినేష్‌రెడ్డి, జగన్మోహన రెడ్డి, జస్వంత్, పవన్‌కుమార్‌రెడ్డి, మితిసెల తనీష్‌రెడ్డి, మహేష్, సాయికృష్ణ, గోకుల్, బాలిక ల విభాగంలో మండవ మహిత, మధులహరి, సువర్చల, అశ్వితరెడ్డి, రేఖతనూజ, పూజిత, దీప్తి, దీపిక, ప్రియాంక, రూపా, పవిత్ర, అనూషలు ఎంపికయ్యారని ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు రాహుల్, ఉపాధ్యక్షులు మండవ గోపి, డి రామిరెడ్డి, ఉలవ నరసింహారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-మద్దిపాడు: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెల్లంపల్లిలో చోటుచేసుకుంది. మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ అహ్మద్ సాహెబ్(73) పొలానికి కాపలా వెళ్లేందుకు రోడ్డు పక్కన నిలుచుని ఉండగా మల్లవరం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బత్తుల సందీప్ నిర్లక్ష్యంగా, అతివేగంతో వాహనాన్ని నడిపి వృద్ధున్ని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనం ద్వారా ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మేదరమెట్ల: కొరిసపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామంలో ఆదివారం ఒక యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూరిమెట్ల విజయ్(30)అనే యువకుడు ఆదివారం ఉదయం తన గృహంలోనే ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మేదరమెట్ల ఎస్ఐ నాగ శివారెడ్డి మాట్లాడుతూ మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆర్థికంగా మానసిక క్షభకు గురయ్యి ఉరేసుకుని మృతి చెందాడని తెలిపారు. పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు మేనేజర్, యానిమేటర్‌పై ఫిర్యాదు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పెద్దపులివర్రు గ్రామపంచాయతీ పరిధిలోని కోళ్లపాలెం గ్రామంలో మల్లెమాల పొదుపు గ్రూపులో యానిమేటర్ కంచర్ల శ్రీలత, పెదపులివర్రు కార్పొరేషన్ బ్యాంక్ మేనేజర్ కుమ్మక్కై గ్రూపులో నుంచి సుమారు 57 వేల రూపాయల సొమ్మును స్వాహా చేశారంటూ ఆదివారం భట్టిప్రోలు ఎస్ఐ అంబటి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. అదేమని అడిగితే మేనేజర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని, మీకు చేతనైంది చేసుకోండి అంటూ దుర్భాషలాడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ విచారించి తగు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోవా ఝాన్సీ, బుస్సా నాగమణి, రాణి తదితరులు ఉన్నారు.

ఒడిశా కార్మికుడు అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



ఒడిశా కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మార్టూరు సమీపంలోని రాజుగారిపాలెం పంట పొలాల్లో ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. జొన్నతాళి వద్ద ఉన్న అమరావతి టెక్స్‌టైల్స్ కంపెనీలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన రామచంద్ర మహాపాత్రో(34) కార్మికుడిగా పనిచేస్తున్నా డు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా విధులకు హాజరు కాకుండా, క్వార్టర్స్‌లో లేకుండా ఉండటంతో తోటి కార్మికులు రామచంద్ర ఆచూకీ కోసం గాలిస్తున్నారు. అయితే ఆదివారం జొన్నతాళి - రాజుగారిపాలెం రోడ్డులో ఉన్న పంట పొలంలో జామాయిల్ చెట్టుకు గుర్తు తెలియని వ్యక్తి కండువాతో ఉరితో వేలాడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు విషయాన్ని సమీపం లోని అమరావతి మిల్లు యాజమాన్యానికి సమాచారమిచ్చారు. పరిశీలిం చిన సిబ్బంది గత రెండు రోజులుగా కనపడ కుండా పోయిన రామచంద్రగా గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని మార్టూరు సీఐ షేక్ థెరిస్సా ఫిరోజ్ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కోడూరి కమలాకర్ తెలిపారు.

లారీ ఢీకొని రైతు మృతి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

పొలానికి వెళ్లడానికి బయలుదేరిన రైతు కాంక్రీట్ మిక్సింగ్ లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గూడవల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. చెరుకుపల్లి పోలీసుల కథనం ప్రకారం గూడవల్లి గ్రామానికి చెందిన లింగనేని శ్రీనివాసరావు(70) అనే రైతు ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో పొలానికి వెళ్లడానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరగా, వెనక నుంచి వస్తున్న కాంక్రీట్ మిక్సింగ్ లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పిసి పల్లి



పామూరు మండలం ఇనిమెర్లకు చెందిన పండ్లమూడి బ్రహ్మ నాయుడు(35) శనివారం రాత్రి 12:26 గంటల సమయంలో పిసిపల్లి మండలంలోని మూలెవారిపల్లి సమీపంలో చనిపోయారు. బ్రహ్మనాయుడు అర్ధరాత్రి మోటార్‌సైకిల్‌పై తమ అత్తగారి ఇంటికి పెదఇర్లపాడుకు వస్తూ చనిపోయాడు. ఈ సంఘటన అర్ధరాత్రి కావడంతో ఎవ్వరూ గమనించలేదు. ఆదివారం ఉదయం దారిన వెళ్లేవారు గమనించి పిసిపల్లి ఎస్ఐకి సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ కె మాధవరావు కేసు నమోదు చేశారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని చదలవాడ సమీపంలో గుండ్లకమ్మ చప్టాపై రెండు ద్విచక్ర వాహనాలు శనివారం రాత్రి ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన విదితమే. వారిలో మద్దిపాడు మండలం ఇనమనమెళ్లూరు పరిధిలోని ఎంపిసి నగర్‌కు చెందిన కొమ్ము అనిల్(24) ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ హరిబాబు తెలిపారు.

27న యుటిఎఫ్ ర్యాలీ

అద్దంకి-ప్రజాశక్తి

యుటిఎఫ్ స్వర్ణోత్సవ ర్యాలీ ఈ నెల 27వ తేదీన అద్దంకిలో ప్రారంభమవుతుందని యుటిఎఫ్ బాపట్ల జిల్లా కన్వీనర్ జగన్నాథం బాబురావు తెలిపారు. ఆదివారం పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ ర్యాలీకి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడుగుల శ్రీనివాసరావు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఈ రామారావు, బి పూర్ణచంద్రరావుతో పాటు ఎస్కే మస్తాన్, హెూలీ సోమయ్య, పల్లి హనుమంతరావు, వి చంద్రశేఖర్, కోటేశ్వరరావు, బాషా తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

కారంచేడు ఎంపీపీ వాసుబాబు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో కేళం రామకోటేశ్వరరావు చారిటబుల్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆదివారం నాడు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ట్రస్ట్ చైర్మన్ కేళం రామ్మోహన్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు పాల్గొని మాట్లాడారు. వైద్యం ఖరీదైన ఈ రోజుల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరం నిర్వహించటం అభినందనీయమని అన్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ సభ్యులను ఆయన అభినందించారు. ఈ వైద్య శిబిరంలో షుగర్ వైద్య నిపుణులు డాక్టర్ పివి నాగరాజు, స్త్రీల వైద్య నిపుణులు డాక్టరు కేళం దీప్తి, డాక్టర్ సుధా హర్షిత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు యాళ్ల రవికుమార్, దివ్య, ఎం భూషయ్య, కేళం శివరాం ప్రసాదు, ఎం వసంతరావు, కటికి వాసు, కేళం పార్వతి, తడవర్తి ఆంజనేయులు తదితరులు పాల్గొనగా 150 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పోలీసు నిర్బంధాన్ని ఖండించండి: సిఐటియు

ప్రజాశక్తి-బాపట్ల: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి సోమవారం విజయవాడలో తలపెట్టిన అంగన్‌వాడీల మహాధర్నాకు అనుమతి లేదంటూ జిల్లాలో పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తలకు నోటీసులు ఇచ్చి ధర్నాకు వెళ్లనీయకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేకచోట్ల అంగన్‌వాడీ కార్యకర్తలను పోలీస్ స్టేషన్లకు రమ్మంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పోలీసు చర్యలను సిఐటియు జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. విజయవాడలో జరుగుతున్న ధర్నాలో పాల్గొనాలని మజుందార్ కోరారు.

నిరసనను భగ్నం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-మేదరమెట్ల: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి,టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ మండలంలోని పమిడిపాడు గ్రామంలో జాగర్లమూడి హరిత శ్రీనివాస్ ఒక్కరోజు నిరసన కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అరగంటలోనే అద్దంకి సీఐ పి రమేష్‌బాబు, కొరిశపాడు ఎస్ఐ జీవి చౌదరి, స్థానిక పోలీసులు కలుగజేసుకొని ఆమెను అరెస్టు చేశారు.

వందే భారత్ రైలును బాపట్లలో నిలిపేందుకు కృషి: ఎంపీ

ప్రజాశక్తి-బాపట్ల: విజయవాడ-చెన్నయ్ మధ్య తిరిగే వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు జిల్లా కేంద్రమైన బాపట్ల రైల్వే స్టేషన్‌లో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని బాపట్ల పార్లమెంట్ సభ్యులు నందిగం సురేష్ అన్నారు. ఆదివారం కొత్తగా విజయవాడ-చెన్నయ్ మధ్య నడిచే వందే భారత్ రైలుకు బాపట్ల రైల్వేస్టేషన్లో శాసనసభ్యులు కోన రఘుపతి తో కలిసి పార్లమెంట్ సభ్యులు సురేష్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నందిగం మాట్లాడుతూ బాపట్ల పార్లమెంటు పరిధిలోని బాపట్ల, వేమూరు, చీరాల ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ఎప్పటికప్పుడు రైల్వే అధికారులతో సంప్రదించి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైల్వే శాఖ అధికారులకు తెలియజేసిన వెంటనే స్పందిస్తూ అభివృద్ధిపై తమకు లేఖల ద్వారా తెలియజేస్తున్నారన్నారు.

కొరటాల స్ఫూర్తితో పోరాడదాం

సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ స్ఫూర్తితో ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి ప్రజల కోసం పోరాడాలని సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య అన్నారు. ఆదివారం కొరటాల సత్యనారాయణ జయంతి సందర్భంగా బాపట్ల ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం నాయకులు కొరటాల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ సిపిఎం తరపున రేపల్లె నియోజకవర్గం శాసన సభ్యులుగా, పార్టీలో అనేక హోదాల్లో పని చేశారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని అనేక సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేసేవారన్నారు. భూస్వామ్య కుటుంబంలో జన్మించిన కొరటాల సత్యనారాయణ కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో లంక భూములను దళితులకు, పేదలకు పంపిణీ చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. చేనేత, రైతుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించారు. కేంద్రంలో అధికారం కోసం అర్రులు చాస్తున్న బిజెపిని కొరటాల స్ఫూర్తితో తరిమికొట్టాలని అన్నారు. దేశంలో మేధావులు, వామపక్షవాదులు ఐక్యంగా మతతత్వ పార్టీలను తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తుంటే రాష్ట్రంలో పాలక, ప్రతిపక్షం చోద్యం చూస్తోందన్నారు. రాష్ట్రంలో


కొరటాల చిత్రపటానికి పూలమాల వేస్తున్న గంగయ్య

పెరిగిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని జరిగే ఆందోళనలో ప్రజలు భాగస్వామ్యం కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోని పాలక ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో గుణపాఠం చెబుదామన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్, సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్, నాయకులు కె శరత్, వై భాస్కరరావు, కె నాగేశ్వరావు, సుభాషిణి, శీను పాల్గొన్నారు.

రేపల్లె: సీపీఎం అగ్రనాయకులు, రేపల్లె నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శతజయంతి సభ రేపల్లె సీపీఎం కార్యాలయంలోని కొరటాల మీటింగ్ హాల్లో ఆదివారం జరిగింది. ముందుగా సీపీఎం సీనియర్ నాయకులు జి దానియేలు కొరటాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ రేపల్లె పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఉద్యమాలలో పాల్గొన్న కొరటాల సత్యనారాయణ నేటి తరానికి ఆదర్శప్రాయుల న్నారు. 1923, సెప్టెంబర్ 24న ప్యాపరు గ్రామంలో జన్మించారు. నేటికి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సీపీఎం పార్టీగా రాష్ట్ర వ్యాప్తంగా కొరటాల శతజయంతి సభలు జరుపుతున్నట్లు తెలిపారు. కొరరటాల స్ఫూర్తితో రేపల్లె ప్రాంతాల్లో ప్రజా ఉద్యమాలాని ముందుకు తీసుకువెళదామని అన్నారు. ఈ జయంతిసభలో సిపిఎం నేతలు కె ఆశీర్వాదం, కె రమేష్, బి నాగరాజు, వి మావో, డి శ్రీనివాసరావు, యూ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: సిపిఎం అగ్రనేత కామ్రేడ్ కొరటాల సత్యనారాయణ శతజయంతి ఉత్సవాన్ని ఆదివారం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్సవంలో పలువురు వక్తలు ప్రసంగించారు. ఆయన ఆశయ సాధనకు కట్టుబడి ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. తొలుత గ్రామ పార్టీ అధ్యక్షులు దీపాల సత్యనారాయణ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురుగుడు సత్యనారాయణ, బట్టు మల్లికార్జునరావు, వేములపల్లి వెంకట రామయ్య, కె రామస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

గ్రహణం వీడిన చంద్రుడిలా..

చంద్రబాబు బయటకు వస్తారు: నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

గ్రహణం వీడిన చంద్రుడిలా చంద్రబాబు బయటకు వస్తారని తెలుగుదేశం పార్టీ బాపట్ల నియోజకవర్గ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆదివారం నరేంద్రవర్మ ఆధ్వర్యంలో బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సంఘీభావ నిరసన దీక్షలో టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, తెలుగు న్యాయవాద విభాగం నాయకులు దీక్షలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబును అరెస్ట్ చేసినప్పటికీ న్యాయం గెలుస్తుందనే నమ్మకం ఉందన్నారు. అన్ని కేసుల నుంచి బయటపడి కడిగిన ముత్యంలా చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని అన్నారు. చట్టం తన పని చేస్తోందని నీతి వాక్యాలు చెబుతున్న జగన్, విజయసాయిరెడ్డిలు నాడు జైలులో ఉన్నప్పుడు ఎందుకు ఆ కబుర్లు చెప్పకుండా అక్రమ అరెస్ట్ అని గొడవలు చేశారని ప్రశ్నించారు. చంద్రబాబు చేసిన అభివృద్ధి, స్కిల్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఫలితాలు కంటికి కనిపిస్తున్నాయని అన్నారు. దాని ద్వారా లబ్ధి పొందిన యువత కళ్లెదుటే ఉన్నారు. ఇంతకంటే వాస్తవాలు ఏం కావాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి సలగల రాజశేఖర్‌బాబు, పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు శ్రీనివాసరావు, చండూరుపల్లి శివ, తెలుగుదేశం పార్టీ టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత, బార్ అసోసియేషన్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి: చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా పని చేసి మన దేశంలోనే కాక ప్రపంచ దేశాల ప్రశంసలు పొందిన గొప్ప మేధావి అని సీనియర్ న్యాయవాది మోతుకూరి సుభాష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ డిపో సమీపంలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలోని న్యాయవాదులు 12వ రోజు రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. అద్దంకి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మురకొండ చంద్రశేఖర్‌తో పాటు నాదెండ్ల హరిబాబు, కరి రామ కృష్ణారావు, వి వీరనారాయణ, కుళ్లి సురేంద్రబాబు, కాకాని లక్ష్మీ నాగేశ్వ రమ్మ, గృహలక్ష్మి, టి అనూషలతో పాటు మండల పరిధిలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు నవీన్ కుమార్, హరికృష్ణ, శ్రీను, వినోద్ తదితరులు దీక్షలో కొనసాగారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతిపక్షంపై కుట్రపూరిత రాజకీయ కక్ష సాధింపు చర్యలను ముఖ్యమంత్రి మానుకోవాలని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు చూస్తూ ఉంటారని, రాబోయే ఎన్నికలలో తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. నందమూరి కళాపరిషత్తు అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, నాగినేని రామకృష్ణ, బండారుపల్లి శ్రీనివాసరావు, కుందారపు రామారావు, దుప్పలపూడి ఆనంద్ ఎర్రకుల రామాంజనేయులు, పరిటాల పవన్ కుమార్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అద్దంకిలో న్యాయవాదుల నిరాహారదీక్ష

కారంచేడు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ రిమాండ్‌ను ఎత్తివేయాలని కోరుతూ జరుగుతున్న నిరసన కార్యక్రమాలు ఆదివారంతో 16వ రోజుకు చేరాయి. కారంచేడు గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీనియర్ టిడిపి నాయకులు, పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడుతోనే మేము అని నోటికి నల్ల గుడ్డలు కట్టుకొని మౌనదీక్షతో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, కాలేషావలి, వంకాయలపాటి సుబ్బారావు, పోతిన వెంకటేశ్వర్లు, రామచంద్రరావు, బొడావుల శివ, పలేటి హరి, బొడావుల గన్, పేర్ని ఆంజనేయులు, లావు శ్యామ్, సుబ్బయ్య, యార్లగడ్డ శ్రీలక్ష్మి, కొల్లా రమాదేవి, నువ్వుల కోటమ్మ, పేర్ని అంజన, పోతిని హైమవతి, కోడూరి చింపరమ్మ, పార్వతి, యార్లగడ్డ పద్మావతి, తాళ్లూరి అనిల్ కుమార్, కొల్లా భాస్కరరావు, బోయన శీను, పైడి బాబు, మహిళా కార్యకర్తలు ఈ నిరసనలో పాల్గొన్నారు.

రేపల్లె: అధికార పార్టీ అక్రమ అరెస్టులకు టీడీపీ శ్రేణులు భయపడేది లేదని టీడీపీ మహిళా విభాగం నాయకులు గౌరీ రామకుమారి అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా పార్టీ శ్రేణులు చేపట్టిన రిలే దీక్షలు 11వ రోజుకు చేరాయి.



బాపట్లలో దీక్షలు చేస్తున్న మహిళలతో వేగేశన నరేంద్రవర్మ

ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు టీడీపీ మహిళా విభాగం సభ్యులు ఆదివారం దీక్షలో పాల్గొన్నారు. ఈ దీక్షలకు పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘాల సభ్యులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార అక్రమ కేసులు, అణిచివేతలు, నిర్బంధాలు, అలజడులు సృష్టించిన టీడీపీ శ్రేణులు భయపడకుండా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నాయని అన్నారు. బాబు అరెస్టు నేపథ్యంలో దేశ, విదేశాల నుంచి చంద్రబాబుకు అనూహ్య రీతిలో ప్రజలు మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. బాబు చేసిన అభివృద్ధే అందుకు నిదర్శనం అన్నారు. టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుదన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ నియంతృత్వ పాలనకు ప్రజలు చమగీతం పాడతారని హెచ్చరించారు. ఈ మేరకు, మేము సైతం బాబుతోనే, టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్, సైకో పోవాలి.. సైకిల్ రావాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీక్షలో పాల్గొన్న టీడీపీ లీగల్ సెల్ నాయకులు వై ధర్మతేజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దున్న జయప్రద, జిల్లా ప్రధాన కార్యదర్శి గోగినేని వసుధ, వెనిగళ్ల సుబ్రమణ్యం, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రేపల్లెలో దీక్ష చేస్తున్న తెలుగు మహిళలు

రెండేళ్ల పాలన సంతృప్తినిచ్చింది

- సిపిడబ్ల్యు స్కీమ్‌లకు నిధులు మంజూరు
- పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత
- జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ప్రజా పరిషత్ ఛైర్ పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ బాధ్యతలు చేపట్టి నేటికి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్ల కాలంలో సిపిడబ్ల్యు స్కీమ్‌లకు నిధులు మంజూరు చేశారు. జడ్‌పి హైస్కూళ్లలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయటం ద్వారా ఉత్తీర్ణతా శాతం పెరిగింది. బూచేపల్లి కుటుంబంపై ఉన్న నమ్మకంతో సిఎం జగన్మోహన్ రెడ్డి మంత్రి స్థాయి పదవిలో వెంకాయమ్మను కుర్చోబెట్టారు. జడ్‌పి ఛైర్‌పర్సన్ రెండేళ్ల పాలనపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం..





జిల్లా ప్రజా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా బూచేపల్లి వెంకాయమ్మ భాద్యతలు చేపట్టిన నాటి నుంచి గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి అవసరాల కోసం నిర్వహిస్తున్న 55 సిపి డబ్ల్యు స్కీములను పరిశీలించి 2022-23 ఆర్థిక సంవత్సరానికి రూ. 27.64 కోట్ల రూపాయలు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.29.36 కోట్లు మంజూరు చేశారు. జడ్‌పి సాధారణ నిధుల నుంచి అసంపూర్తిగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవానాలు పూర్తి చేయడానికి, గ్రామీణ రోడ్లు డ్రైనేజ్, తాగునీరు, విద్య,వైద్యం, విద్యుత్, వ్యవసాయం, క్రీడలు, శ్మశాన వాటికల అభివద్ధి కోసం రూ. 6.8 కోట్ల రూపాయల విలువ గల పనులకు పరిపాలనామోదపు ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23లో రూ.11.90 కోట్ల రూపాయల విలువైన పనులకు పరిపాలనామోదపు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిషత్ సాధారణ నిధుల నుండి అనేక పద్దులలో దాదాపు రూ.50 కోట్ల అంచనా విలువైన పనులను మంజూరు చేశారు.

దర్శి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు

దివగంత బూచేపల్లి సుబ్బారెడ్డి, డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డిని ఎమ్మెల్యేలుగా ఆదరించి, తనను జడ్‌పిటిగా ఏకగ్రీవం ఆదరించి ఛైర్ పర్సన్‌ను చేసిన దర్శి నియోజకవర్గలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తాగునీటికి, గ్రామాలలో శివారు కాలనీలలో రోడ్ల అభివద్ధికి దాదాపు రూ.10 కోట్ల రూపాయలు వెచ్చించారు. బూచేపల్లి వెంకాయమ్మ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దర్శి నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్లు నిర్మించారు. జిల్లా ప్రజా పరిషత్ యాజమాన్యములో పనిచేస్తున్న సిబ్బందికి పదోన్నతులు కల్పించారు. ఆఫీస్ సబార్డినేట్ స్థాయి నుంచి రికార్డు అసిస్టెంట్‌గా 15 మందికి, రికార్డ్ అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్స్‌గా 9 మందికి, జూనియర్ అసిస్టెంట్ నుంచి సీనియర్ అసిస్టెంట్‌లుగా 17 మందికి, సీనియర్ సహాయకుల ఽంచి పరిపాలనదికారులుగా 11 మందికి వెరసి మొన్న 52మందికి ఉద్యోగన్నతులు కల్పించారు.





సంతృప్తినిచ్చిన రెండేళ్ల పాలన

జడ్‌పి ఛైర్‌పర్సన్‌గా రెండేళ్ల పాలన సంతృప్తినిచ్చింది. బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎలాంటి ఒడిదుడుకులు. లేకుండా, విభేధాలకు తావు లేకుండా అందరూ సహకరిస్తున్నారు. తనకు అన్ని విధాల సహకరిస్తున్న మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నా. పరిపాలనలో సంపూర్ణ సహకారం అందిస్తున్న ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ దినేష్ కుమార్, జడ్పీ సిఇఒ బి.జాలిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

- జడ్‌పి ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ.

ఆరు నెలలు తర్వాత 'పల్లెవనం' పార్కు

- రూ. 45 లక్షలతో పార్కు ఆధునీకరణ

ప్రజాశక్తి-దరిశి

దరిశిలో 5 సంవత్సరాలు క్రితం ప్రారంభమైన పల్లెవనం పార్కుకు మరలా ఆధునీకరణ పనులు రూ.45 లక్షలతో చేసి నూతనంగా శనివారం ప్రారంభించారు. 5 సంవత్సరాల క్రితం దరిశి-కురిచేడు రోడ్డులో రూ.2 కోట్లకు పైగా ఖర్చు పెట్టి అప్పట్లో మంత్రిగా ఉన్న శిద్ధా రాఘవరావు పల్లెవనం పార్కు ప్రారంభించారు. నాలుగేళ్ల వరకు పార్కులో ఆట వస్తువులు అన్ని భాగానే ఉన్నాయి. క్రమేణ ఆట వస్తువులు చెడిపోయి పాడైపోవటంతో గత మార్చిలో అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కృషితో పార్కుకు రూ.45 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో చెడిపోయిన ఆట వస్తువులన్నీంటికి మరమ్మతులు చేసి, కొన్ని కొత్త ఆటవస్తువులు ఏర్పాటు చేసి ఆధునీకరణ చేశారు. అదేవిధంగా మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. పనులు పూర్తి కావడంతో పార్కును శనివారం తెరవడంతో పిల్లలందరు పార్కుకు వచ్చారు. ఈ పార్కుకు 6 నెలల తరువాత ఆధునీకరణ పనులు చేసి పార్కుకు అన్ని హంగులు ఏర్పాటు చేయడంతో చిన్నారులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఆధునీకరణ తర్వాత పల్లెవనం పార్కు ముఖద్వారం

నిమజ్జనానికి భారీగా వినాయక విగ్రహాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాకాల సముద్ర తీరంలో ఆదివారం జనంతో సందడి నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పాకల సముద్ర తీరానికి 212 గణేష్ విగ్రహాలు నిమజ్జనానికి వచ్చాయి. గ్రామాల్లో రాత్రుల సమయంలో గణేష్‌ను ఊరేగించుకొని పగలు పాకల సముద్ర తీరానికి తరలించారు. శింగరాయకొండ, కందుకూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, పీసీపల్లి, కనిగిరి, టంగుటూరు, జరుగుమల్లి, చీమకుర్తి, కొండపి మండలాల నుంచి ఆదివారం పాకల సముద్ర తీరానికి వినాయకులతో వచ్చి నిమజ్జనాలు నిర్వహించారు. ఆదివారం కావడంతో సముద్ర తీరానికి భారీగా మహిళలు తరలివచ్చారు. ఒంగోలు డి.ఎస్.పి నారాయణస్వామిరెడ్డి, శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్, టంగుటూరు ఎస్ఐ ఖాదర్‌బాషా, జరుగుమల్లి ఎస్ఐ శ్రీనివాసరావు, మెరైన్ ఎస్ఐ మీరావలి ఆధ్వర్యంలో సముద్ర తీరం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పాకల తీరంలో వినాయకున్ని నిమజ్జనం చేస్తున్న దృశ్యం



వినాయక నిమజ్జనానికి వచ్చిన జనంతో కిటకిటలాడుతున్న కొత్తపట్నం

మెరైన్ పోలీసులతో పాటు మత్స్యకారులను భారీగా అక్కడ ఉంచి. సముద్ర స్నానాలు చేసే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ఒంగోలు డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పరిశీలించారు.

కొండపి: కొండపి మండలంలోని పెదకండ్లగుంట గ్రామానికి చెందిన టిడిపి నాయకులు శనివారం రాత్రి గ్రామంలో వినాయక ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. ఆదివారం నాడు ఉదయం కొండపిలోని మేళతాళాలతో ఘనంగా నిమర్జనానికి తరలించారు. తప్పెట్ల కళాకారులు వారి వాయుద్యాలతో ప్రజలను అలరించారు. అదే విదంగా వినాయకుడుతో పాటు ఎన్టీఆర్ విగ్రహాన్ని కూడా ట్రాక్టర్ ముందు పెట్టి ఊరేగించడం విశేషం. టిడిపి నాయకులు, మాజీ సర్పంచ్ తానికొండ వెంకటేశ్వర్లు, గ్రామ అధ్యక్షులు కొల్లూరి మల్లిఖార్జునరావు, టిడిపి యూత్ పోర్సు యువకులు, నాయకులు, మహిళలు, గ్రామస్తులు ఈ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎంపీ గారూ.. గామాలపై దృష్టి పెట్టండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి చొరవతో జిల్లాలో ఆర్వో ప్లాంట్లు మంజూరు కావడం శుభ పరిణామం. అయితే పశ్చిమ ప్రాంతంలో మంచినీటి సమస్యతో పాటు ఫ్లోరిన్ సమస్య అధికంగా ఉందన్నారు. ఈ క్రమంలో మార్కాపురం మండలంలోని పెద్దనాగులవరం, వేములకోట, తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లె, గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు, కొమరోలు మండంలోని నల్లగుంట్ల, యర్రగొండపాలెం మండలంలోని గుర్రపుశాల, పెద్దదోర్నాల మండలంలోని రామచంద్రకోట, పెద్దారవీడు మండలంలోని మద్దలకట్ట, పుల్లలచెరువు మండలంలోని మల్లాపాలెం, త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం, దొనకొండ మండలంలోని మంగినపూడి, బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండం గ్రామాల్లో నీటి సమస్యతో పాటు ఫ్లోరిన్ అధికంగా ఉంది. అందుచేత ఈ గ్రామాల్లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసి ప్రజలను ఆదుకోవాలని పశ్చిమ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



జలమయమైన రైల్వే స్టేషన్ రోడ్డు

చీరాలలో భారీ వర్షం

ప్రజాశక్తి - చీరాల

చీరాలలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రధాన రహదారులు జలమయంగా మారాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మసీదు రోడ్డు, ధర్బార్ రోడ్డు, ముక్కోణం పార్క్ సెంటర్ వద్ద రోడ్లపై వర్షం నీరు భారీగా నిలబడింది. ప్రధానంగా మురుగు కాలవలు వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి మోకాళ్ళ లోతు వరకు వర్షం నీరు రోడ్లపై నిలబడుతుందని పుర ప్రజలు చెబుతున్నారు. దీంతో వర్షం పడిన ప్రతి సారి మోకాళ్ల లోతు నీళ్లు రోడ్లపైన నిలబడుతున్న పరిస్థితి నెలకొంటున్నది. నీళ్లు నిలబడటం వల్ల ప్రయాణీకులు, బాటసారులు ఇబ్బందులు పడుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పొదిలి : పొదిలి ఎస్వీకెపి డిగ్రీ కళాశాల 1979 -82 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలిశారు. 40 ఏళ్ల తర్వాత కలిసిన వీరంతా ఘనంగా నాటి గురువులను సన్మానించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పట్టణాల్లో, వివిధ హోదాల్లో పని చేస్తున్నవారు, ఉద్యోగ విరమణ చేసిన వారు ఈ బ్యాచ్‌లో ఉండటం విశేషం. నాటి గురువులైన పోలయ్య, రాదాకష్ణ, విశ్వనాథం, రామా చలపతి, శేషగిరి, ప్రస్తుత కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ జిసి సుబ్బారావులను పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తహశీల్దార్ చంద్రావతి, సుబ్బారావు, జగదీష్, సుధాకర్, ఉమామహేశ్వరి, ఎలిజిబెత్, రాణి, మేరీ కుమారి, రాజేశ్వరి మురళీకష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొరటాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

కొరటాల సత్యనారాయణ శతజయంతి సందర్భంగా ఒంగోలు ప్రజాశక్తి ఎడిషన్ కార్యాలయంలో సిబ్బంది ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. నివాళులర్పించిన వారిలో బ్యూరో ఎస్‌వి.బ్రహ్మాం, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జీ ఎ.బ్రహ్మయ్య, సబ్ ఎడిటర్ వై.శ్రీనివాసులు, జి శ్యామ్‌బాబు, ఎ.దుర్గారావు, సిబ్బంది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఒంగోలు

నిరసన తెలిపే స్వేచ్ఛ కూడా లేదా.?

పోలీసులను ప్రశ్నించిన సిఐటియు నేత రాము

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు కూడా తమకు లేదా అంటూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు టంగుటూరి రాము పోలీసులను ప్రశ్నించారు. ఆదివారం టంగుటూరు పోలీసులు రాము ఇంటికి వచ్చి బయటకు వెళ్లడానికి వీలు లేదంటూ నోటీసు జారీ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 25వ తేదీన అంగన్వాడీ కార్యకర్తలు విజయవాడలో తలపెట్టిన మహా ధర్నాకు హాజరు కాకూడదంటూ పోలీసులు నోటీస్ ఇవ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం తక్షణమే గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పింఛన్‌గా ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తూ వారు విజయవాడలో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. తమ న్యాయమైన డిమాండ్ల


ఇంటి నుంచి బయటకు వెళ్లొద్దంటూ నోటీసు ఇస్తున్న పోలీస్

సాధన కోసం చేపట్టిన ధర్నాను ప్రభుత్వం ఈ విధంగా పోలీసులతో అడ్డుకోవడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. **పిసి.పల్లి:** నేడు అంగన్‌వాడీలు తలపెట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళవద్దంటూ ప్రభుత్వం ఒత్తిడి మేరకు పోలీసులు ముందస్తు హెచ్చరికలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శనివారం నుంచే అంగన్‌వాడి వర్కర్ల ఇళ్లకు వెళ్ళి విజయవాడ వెళ్ళవద్దంటూ నోటీసులు జారీ చేస్తున్నారు. సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు ధర్నాకు పిలుపునిచ్చారు. అందుకోసం విజయవాడ వెళ్తే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. అంగన్‌వాడి మినిసెంటర్ వర్కర్ ఇంటికి శనివారం రాత్రి వెళ్లి విజయవాడ వెళ్ళవద్దంటూ నోటీసులు జారీ చేశారు. తమ కుమార్తెకు ఆరోగ్యం భాగాలేక విజయవాడలో వైద్యం చేయించుకుంటున్నానని చెప్పినప్పటికీ వినిపించుకోకుండా విజయవాడ వెళ్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు తెలిపారు. సిఐటియు నాయకులకు కూడా నోటీసులు అందజేశారు. సిఐటియు నాయకులు కానీ, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు కాని, వారి బంధువులు కానీ విజయవాడలో జరిగే ధర్నా కార్యక్రమంలో పాల్గొంటే కేసులు నమోదు చేస్తామని, తీవ్రమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి భయభ్రాంతులకు గురి చేశారు.

సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-కొండపి

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ వాడకం చేసుకుని, దానికి సంబంధించిన విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని కరెంటు ఏఈ కుంచాల కోటయ్య తెలిపారు. కొండపి మండలం కందుకూరు డివిజన్ స్థాయిలో వ్యవసాయ మోటర్ విద్యుత్ బకాయిలో మొదటి స్థానంలో దాదాపు రూ.7లక్షలు విద్యుత్ బకాయిలు నిలబడ్డాయన్నారు. మూగచింతల, గుర్రపడియ, పెట్లూరు, చవటపాలెం, నెన్నూరుపాడు, అనకర్లపూడి, జాళ్లపాలెం గ్రామాలకు చెందిన రైతులు 80శాతం బిల్లులు పెండింగులో ఉన్నాయన్నారు. అదే విధంగా మిగతా అన్ని గ్రామాల్లో 50 శాతం బిల్లులు పెండింగులో ఉన్నాయని, ఈ నెల 25వ తేదీ లోపు విద్యుత్ బిల్లులు చెల్లించి సహకరించాలని ఆయన కోరారు. విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే 80 శాతం విద్యుత్ బకాయిలు ఉన్న గ్రామాలకు మూడో పేస్ ఎత్తివేయడం జరుగుతుందన్నారు. 50 శాతం పెండింగులో ఉన్న గ్రామాలకు చెందిన రైతులకు మోటార్ సర్వీసులు లేదా వారి గృహాలకు సంబంధించిన సర్వీసులను తొలగించి విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.


పూజల్లో పాల్గొన్న శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు

శిద్దా సుధీర్ దంపతుల ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిడి బోర్డు డైరక్టర్,రాష్ట్ర చాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ శిద్దాసుధీర్‌కుమార్, శృతి దంపతులు వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణమండపంలో వాసవి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ఈ ఏడాది ఎలాంటి విఘ్నాలు లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో వెలుగొందాలని కోరారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య, వాసవి యూత్ నాయకులు నూనె అనుదీప్, చల్లగండ్ల హనుమంతరావు, నూకల సురేంద్ర, ఆలపాటి నరసింహారావు, చలువాది రవితేజ, వాసవి మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కార్యదర్శిగా ఖుర్షీద్ బేగం

యర్రగొండపాలెం: ముస్లిం రచయితలు సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శిగా యర్రగొండపాలెంలోని ఎంపియూపి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ ఖుర్షీద్‌బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముస్లిం రచయితలు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం గుంటూరులోని కోబాల్ట్‌పేట నాల్గో లైనులోని సంఘ కార్యాలయంలో వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు కరిముల్లా పర్యవేక్షణలో జరిగింది. రాష్ట్ర మహిళా కార్యదర్శిగా షేక్ ఖుర్షీద్ బేగం, రాష్ట్ర అధ్యక్షులుగా అబ్దుల్ హకీం, ప్రధాన కార్యదర్శిగా గుల్ఫామ్ ఖాదర్‌భాష, ఉపాధ్యక్షులుగా అబ్దుల్ సమద్, సహాయ కార్యదర్శిగా మహమ్మద్ రఫీ, కోశాధికారిగా బషీర్ గర్తపురి, కార్యదర్శులుగా ఎస్ఎం సుభాని, ఫరూఖ్ ఖాన్, షేక్ మహమ్మద్ రఫీ, మహిళా కార్యదర్శిగా షేక్ బషీరున్నీసా బేగం, మీడియా కార్యదర్శిగా షేక్ మహబూబ్ సుభాని ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన అధ్యక్షులు అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ మత సామరస్యం, సామాజిక, సాహిత్య చైతన్యం, భారత రాజ్యాంగం విలువలకు కట్టుబడి తమ రచయితల సంఘం పని చేస్తుందని తెలిపారు.

మొర్రి పిచ్చయ్యకు ఘన సత్కారం

గిద్దలూరు : ప్రకాశం జిల్లా హిందీ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందీ దినోత్సవ కార్యక్రమం పొదిలిలో జరిగింది. జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఇటీవల తెలంగాణ రాష్ట్రం నుంచి గురుబ్రహ్మ పురస్కారం 2023 వరించిన సందర్భంగా రాష్ట్ర హిందీ టీచర్స్ గౌరవాధ్యక్షులు పటాన్ మహబూబ్ ఖాన్, మార్కాపురం డిప్యూటీ డీయివో చంద్రమౌళీశ్వర్, ప్రకాశం జిల్లా డిసిఇబీ సెక్రటరీ వెంకట్రావ్‌ల చేతుల మీదుగా మొర్రి పిచ్చయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డివిజన్ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవ రెడ్డికి ఘనస్వాగతం

ప్రజాశక్తి-పొదిలి

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసుల రెడ్డి కుమారుడు మాగుంట రాఘవ రెడ్డి ఆదివారం పొదిలికి వచ్చిన సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పొదిలి పట్టణంలోని జూనియర్ కాలేజ్ రోడ్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద పూజలో


రాఘవరెడ్డికి స్వాగతం పలుకుతున్న దృశ్యం

పాల్గొనటానికి వచ్చిన రాఘవ రెడ్డికి కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. అనంతరం ఆయన వినాయకుడి పూజా కార్యక్రమంలో పాల్గొని నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, ఎస్‌కె నూర్జాహాన్ బేగం, కల్లం సుబ్బారెడ్డి, జి శ్రీను, యక్కలి శేషగిరిరావు, కంకణాల రమేష్, మీగడ ఈశ్వర రెడ్డి, కెకెమిట్ల ఎంపిపి మోరబోయిన మురళికృష్ణ, యస్థాన్, జాకీర్, వెంకట రెడ్డి, సిసికెఆర్‌శ్రీనివాస రెడ్డి, ఫిరోజ్, నాయకులు కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వనాధపురం లడ్డు రూ.12116లు : ఆదివారం స్థానిక విశ్వనాధపురం నాల్గవ లైన్ కూడలివద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం నిమజ్జం సందర్భంగా లడ్డువేలం పాట జరిగింది. ఈ లడ్డును మాజీడీలర్ వెంకటేశ్వర్లు రూ.12116లకు వేలంపాడారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

ప్రజాశక్తి-సిఎస్.పురం

సమస్యలను పరిష్కరించుకోడానికి విశ్వబ్రాహ్మణులంత కలిసిపోరాటం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు. సిఎస్.పురం బస్టాండ్ సెంటర్‌లో గల విశ్వబ్రాహ్మణ కార్యాలయంలో మండల అధ్యక్షులు వడ్లమాను నారాయణ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైన శ్రీనివాసాచారి మాట్లాడుతూ సంఘ సభ్యులంతా ఐక్యతతో ఉండి రాజ్యాంగబద్ధంగా అందవలసిన ప్రతిఫలాలు సాధించుకొని ప్రతి ఒక్కరికి అందేలా పని చేయాలన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన పిసి.పల్లి మండల విద్యాశాఖ అధికారి రాచగొర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ సంప్రదాయ కుల చేతి వత్తులు వారికీ ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యువజన పథకంలో పావల వడ్డీతో మొదటి విడత లక్ష రూపాయలు, రెండవ విడత రెండు లక్షలు రూపాయలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, అర్హులైన సోదర సోదరీమణులు అందరు కామన్ సర్వీస్ సెంటర్స్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంగం రాష్ట్ర కార్యదర్శి పొన్నపల్లి బ్రహ్మానందం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినుకొండ శ్యామలమల్లికార్జున, జిల్లా కార్యదర్శి నిమ్మకూరు మాల్యాద్రి, కనిగిరి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పత్తిపాటి బాలగురు బ్రాహ్మాచారి, నడింపల్లి శ్రీనివాసచారి, వినుకొండ కార్తీక్, స్థానిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్‌గా 'మువ్వల'

ప్రజాశక్తి-పొదిలి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ బోర్డు డైరక్టర్‌గా మువ్వల పార్థసారథిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నూతన కార్యవర్గ కమిటీ మొదటి సమావేశం పొదిలిలోని వెలిశెట్టి వెంకటేశ్వర్లు (శ్రావణి) గెస్ట్ హౌస్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ బోర్డ్ విభాగం, అడ్వైజరీ బోర్డ్, కార్యనిర్వాహక కమిటీ విభాగాల సభ్యుల పేర్లను ఏకగ్రీవంగా ప్రకటించారు. అనంతరం మూడు విభాగాల సభ్యులు చర్చించుకుని తదుపరి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. పాల్గొన్న కమిటీల సభ్యులు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్నుకోబడిన మూడు విభాగాల సభ్యుల పేర్లను ప్రకటించారు. డైరెక్టర్స్ బోర్డ్ విభాగంలో ఛైర్మన్‌గా మువ్వల పార్థసారథి, వైస్ ఛైర్మన్‌గా షేక్ నూర్జహాన్, కన్వీనర్‌గా కే.యల్లమందారెడ్డి, డైరెక్టర్లుగా గునుపూడి చెంచు సుబ్బారావు (జిసి), కాటూరి వెంకట నారాయణ బాబు (పెదబాబు), వెలిశెట్టి వెంకటేశ్వర్లు (శ్రావణి), యక్కలి శేషగిరిరావు, యర్రం వెంకట రెడ్డి, వరికుంట్ల అనిల్ (పండు), కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులుగా కళ్ళం వెంకట సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా బండి అశోక్, కార్యదర్శిగా తానికొండ వెంకట్రావు, జాయింట్ సెక్రటరీగా భూమా సుమంత్, కోశాధికారిగా సోమిశెట్టి చిరంజీవి, విద్యావిభాగానికి బీవీ రెడ్డి, ఆరోగ్యవిభాగానికి గూడూరి వినోద్ కుమార్, అత్యవసర విభాగానికి మేడా నరసింహారావులను ఎంపిక చేశారు. సలహాబోర్డు సభ్యులుగా వాకా వెంకటరెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, సామంతపుడి నాగేశ్వరరావు, మాకినేని వెంకట రమణయ్య, డాక్టర్ స్వర్ణ గీత, గొలమారి చెన్నారెడ్డి, ధర్నాసి రామారావు, షేక్ యస్థాన్, షేక్ బాజీ కరిముల్లాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న దాసరి గురుస్వామి

దేశభక్తి వారోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

జన విజ్ఞాన వేదిక కొనకనమిట్ల మండల కార్యవర్గ సమావేశం స్థానిక జెవివి కార్యాలయంలో అధ్యక్షులు పివి కొండయ్య అధ్యక్షతన ఆదివారం రాత్రి జరిగినది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రకాశం జిల్లా సహాధ్యక్షులు దాసరి గురుస్వామి మాట్లాడుతూ కొనకనమిట్ల మండలంలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మూడ విశ్వాసాలు, మూఢనమ్మకాలు సమాజంలో జరుగుతున్న అనేక రుగ్మతల గురించి ప్రజలకు తెలియజేయాలని కోరారు. అదేవిధంగా జెవివి ఆధ్వర్యంలో జరుగుతున్న దేశభక్తి వారోత్సవాలను కూడా విజయవంతం చేయాలని, సభ్యత్వ నమోదు పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జి.ఐజాక్‌బాబు, పి.బాలనరసయ్య, షేక్.మహమ్మద్‌ఆలీ, మండల అధ్యక్షులు పివి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన కొల్లాబత్తిన పూర్ణచంద్రరావు-అభినయల వివాహ మహోత్సవం టంగుటూరులో ఆదివారం వైభవంగా జరిగింది. స్థానిక కొండపి రోడ్డులోని సివిఆర్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఈ వివాహ కార్యక్రమానికి కొండపి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ వధూవరుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని జరుగుమల్లి మండల వైసీపీ అధ్యక్షులు బత్తిన మదన్‌మనోహర్, నియోజకవర్గ వైసీపీ నాయకులు మన్నం వెంకయ్య, గుండపురెడ్డిశ్రీహరిరెడ్డి, దుగ్గిరాల పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.


వేడుకలో మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

జగనన్న సురక్ష సర్వేను నిర్లక్ష్యం చేస్తే ఇంటికే..

జడ్ పి సిఇఓ జాలిరెడ్డి

ప్రజాశక్తి నాగులుప్పలపాడు

జగనన్న సురక్ష సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాలంటీర్లు క్లస్టరు సూపర్ వైజర్లుగా ఉన్న సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్ళక తప్పదని జిల్లాపరిషత్ సిఇఒ, ఇన్‌చార్జి డిపిఒ జాలిరెడ్డి పేర్కొన్నారు ఆదివారం మండలంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వే పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్షకు సర్వేకి సంబందించిన సమాచారాన్ని వాలంటీర్ల ద్వార తెలియజేయుట యాప్‌లో నిక్షిప్తంగా చేయాల్సి వచ్చినందుకు వాలంటీర్లపై సూపర్ వైజర్లుగా పంక్షనల్ అసిస్టెంట్లలను నియమించటం జరిగిందన్నారు. తద్వార వారు మానిటరింగ్ చేస్తూ సర్వేపూర్తిచేయవలసి ఉందన్నారు. అందులో భాగంగా తొలివిడతగా 10సచివాలయాలకు సంబందించి ఈనెల 30వ తేది జరిగే సమావేశానికి 21వ తేది నాటికి సర్వే పూర్తి చేయవలసి ఉండగా మండలంలో చాలమందకొడిగా సర్వేపూర్తిచేశారని మండిపడ్డారు. అందులో మేజరు పంచాయతీ అయిన ఉప్పుగుండూరులో మరి చాల మందకొడిగా సాగుతుందని అన్నారు. ఏది ఏమైనా ఆదివారం సాయంత్రంలోపు పంక్షనల్ అసిస్టెంట్‌లు వారి పరిదిలో ఉన్న వాలంటీర్లచే సమన్వయం చేసుకొని ఎట్టిపరిస్థితుల్లో సర్వే పూర్తిచేసే విదంగా చూడాలని, సర్వే పూర్తి చేయని వాలంటీర్లను తొలగించాలని, సచివాలయ సిబ్బందికి సోకాష్ నోటీసులు జారీ చేయాలని ఇఒఆర్‌డి ఎవివి కుమారిని ఆదేశించారు.



జగనన్న సురక్ష సర్వే వివరాలను పరిశీలిస్తున్న జడ్‌పి సిఇఒ

జలజీవన్ మిషన్ పంచాయతీ అవినితిపై విచారణ

మండలంలోని మేజర్ పంచాయతీ అయిన ఉప్పుగుండూరు పంచాయతీలో జలజీవన్ మిషన్‌కు సంబంధించిన పంచాయతీలో జరిగిన అవినీతి గురించి పత్రికల్లో వచ్చిన కథనాలపై విచారించారు. తొలుత సర్పంచ్ దేవరకొండ జయమ్మను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఇన్‌చార్జి కార్యదర్శిగా ఉన్న శ్రీరామ్మూర్తిని, సిబ్బందిని విడివిడిగా విచారించారు. విచారణ చేపట్టిన డిఎల్‌పిఒ పద్మావతి అందచేసే నివేదిక ఆధారంగా దోషులు ఎవరైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలోని ఎస్‌కెవిపి కళాశాలలో మాగుంట వారిచే ఏర్పాటు చేసిన టి10 క్రికెట్ టోర్నమెంట్‌ను మార్కాపురం శాసనసభ్యులు కుందూరు నాగార్జున రెడ్డి యువ నాయకులు మాగుంట రాఘవ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిల్లంచెర్ల బాలమురళీకృష్ణ ఎఎంసి చైర్మన్ శ్రీనివాసరెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-సిఎస్.పురం

రహమత్ నగర్‌లోని దర్గా వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. మండలంలోని వెంకటాయచెరువు గ్రామనివాసి గుంటూరులో నివాసం ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త మూడి కొండయ్యాయాదవ్ తన ఆర్థిక సహాయంతో వందలాదిమంది భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ కమిటీ సభ్యులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో చెర్లోపల్లి మాజీ సర్పంచ్ పులిమి ఆదినారాయణ, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాలకు నీరు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ప్రజాశక్తి దినపత్రిక జిల్లా పేజీలో ఫలితమివ్వని ముటుకుల అనే వార్త ఈనెల 23వ తేదిన ప్రచురితమైంది. దానికి ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారులు స్పందించారు. ఈ మేరకు ప్రాజెక్టు పరిధిలో తెల్లగట్ల వద్ద సీడబ్ల్యూఎస్ నుంచి గంగవరం గుట్టపై 40 కెఎల్ ఓహెచ్‌బిఆర్ వరకు 315/8 హెచ్‌డిపీఈ పంపింగ్ మెయిన్‌లో ఫ్రిక్వెంట్ లీకేజీల కారణంగా పథకం పని చేయలేదు. కానీ ప్రస్తుతం దెబ్బతిన్న 315/8 హెచ్‌డిపీఈ పంపింగ్ మెయిన్ స్థానంలో గిద్దలూరు ప్రాజెక్టు వద్ద అందుబాటులో ఉన్న 250 డిఐకె9 పైపులు వచ్చాయి. ఇప్పుడు ఈ పథకం ఏప్రిల్ 2023 నుంచి చాపలమడుగు గ్రామం వరకు ఆవాసాలలో నడుస్తోంది. ప్రస్తుతం నీటి సరఫరా సమయంలో గ్రావిటి మెయిన్స్‌లో ఏదైనా లీకేజీలు సంభవించినట్లయితే వాటిని పునరుద్ధరిస్తాము. ప్రాజెక్టు పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరాకు కృషి చేస్తామని యర్రగొండపాలెం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణ తెలిపారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి-దరిశి

ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జిల్లా ఫ్యాప్టో అధ్యక్షులు కెవిజి కీర్తి అన్నారు. ఆదివారం స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఫ్యాప్టో, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఎపిసిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు తరుపున శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో పాత పింఛన్ విధానం అమలు చేస్తానని చెప్పారని, ఇప్పుడు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. నేడు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఒంగోలులో కలెక్టరేట్ వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ తరుపున చక్రాధర్, బుర్రి శ్రీను, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు మీనిగ శ్రీను, యల్లమందారెడ్డితో పాటు వివిధ సంఘాల నాయకులు శ్రీదేవి, వెంకటేశ్వర్లు, గోవిందు, విక్రం, నాగరాజు, తూము శ్రీను, వెంకట్రావు, కె. వెంకటేశ్వర్లు, క్రిష్ణారెడ్డి, బాలాజీ, సత్యనారాయణ, రంగస్వామి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఫ్యాప్టో ఉపాధ్యాయ సంఘాలు

11వ రోజూ టిడిపి రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, సైకోలా వ్యవహరిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డికి హిట్లరుకు పట్టిన గతే పడుతుందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు విమర్శించారు. ఆదివారం యర్రగొండపాలెంలో జరుగుతున్న టిడిపి రిలే నిరాహార దీక్షలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడటానికి ప్రజలంతా ఒక్కటై చంద్రబాబుకు మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పరిశీలకులు వేములకొండ శ్రీనివాస్, నాయకులు డాక్టర్ మన్నె రవీంద్ర, చేకూరి సుబ్బారావు, ఏరువ మల్లికార్జునరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, శనగా నారాయణరెడ్డి, చిట్టేల వెంగళరెడ్డి, షేక్ మస్తాన్‌వలి, షేక్ ఇస్మాయిల్, షేక్ వలి, గురిజేపల్లి జిలాని, తోటా మహేష్ నాయుడు, షేక్ జిలాని, చేకూరి ఆంజనేయులు, వడ్లమూడి లింగయ్య, గోళ్ల సుబ్బారావు, మెడబలిమి అచ్యుతరావు, లక్ష్మయ్య యూసుఫ్, షేక్ జిలాని, ప్రసాద్, మంత్రూ నాయక్, చెవుల అంజయ్య, షేక్ మాబు, సంజీవరెడ్డి రామయ్య, కమ్మ సంఘం నాయకులు పారా గాలెయ్య, న్యాయవాది రంగా, పోకూరి సతీష్, గాంధీ, శ్రీనులు పాల్గొన్నారు. **కొండపి :** ఆధారాలు లేని కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్రమ అరెస్టు చేయడం వైసిపి ప్రభుత్వ పిరికిపంద చర్య అని కొండపి మండల టిడిపి అధ్యక్షుడు బొడ్డపాటి యలమందనాయుడు విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు కొండపిలోని ఎస్సీకాలనిలోని చర్చి వద్ద నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యలమందనాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టుతో నాయకులు, కార్యకర్తలు వెనుకడుగు వేస్తారనుకోవడం జగన్మోహన్‌రెడ్డి మూర్ఖత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వసంతరావు, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, గుండపనేని రామూర్తి నాయుడు, దామా మురళి, చింతల వెంకటరావు, రావిపాటి బాలకృష్ణ, ముప్పనేని వీరాస్వామి, నన్నూరి సుబ్బరామయ్య, బి.సోమయ్య, మండల యూత్ అధ్యక్షులు కాలేషా, ఐటిడిపి నాయకులు, ముక్కు ప్రసాదు, యం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



వైపాలెంలో రిలే దీక్షలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

దరిశి : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జైలు నుంచి విడుదలయ్యేంతవరకు పోరాటాలు చేస్తుంటామని దరిశి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు అన్నారు. ఆదివారం స్థానిక కురిచేడు రోడ్‌లో దరిశి కమ్మసంఘం ఆధ్వర్యంలో 11వ రోజు రిలే నిరాహారదీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా దరిశి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, దరిశి పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు, నాయకులు దారం సుబ్బారావు, శోభారాణి, సందు పాల్గొన్నారు.



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సర్వేంద్రియానం నయనం ప్రధానమని పెద్దలు చెప్పినట్లుగా శారీరకంగా మనం ఎంత బలంగా ఉన్నప్పటికీ కంటి చూపు సరిగా లేనిదే జీవనం కష్టసాధ్యమని యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటిండెంట్, ఐటిడిఏ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం యర్రగొండపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ సౌజన్యంతో శంకర కంటి ఆసుపత్రి రూరల్ హోప్ ఫౌండేషన్, అమెరికా, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా రిబ్బన్ కట్ చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 159 మందికి వైద్య పరీక్షలు చేయగా 47 మందిని శుక్లాలు ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఎగ్జిక్యూటివ్ నాగబాబు, డాక్టర్లు భక్తి, బితిని, యోగిత, ఎంఈవో పి ఆంజనేయులు, సీపీఐ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య, శ్రీనివాస్, కెవి కష్ణ గౌడ్, బాణాల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-సిఎస్.పురం

మండలంలోని డీజీపేట గ్రామానికి చెందిన కోవిలంపాటి వెంకటేశ్వర్లు, ఆయన కుమారుడు ఆచారికి ఇటీవల ప్రమాదం జరిగి ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకున్న విశ్వబ్రాహ్మణ సంగం తరుపున ఆర్థిక సహాయంగా రూ.27వేలు నగదును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా డీజీ పేటలోని బాధితుల స్వగ్రామానికి వెళ్లి వారిని పరామర్శించి దాతలు ద్వారా సేకరించిన నగదును పీసీ పల్లి మండల విద్యాశాఖ అధికారి రాచగొల్ల శ్రీనివాసులు, సంగం జిల్లా కమిటీ నాయకుల చేతులు మీదుగా బాధితులకు అందచేశారు. తమకు విరాళాలు అందచేసిన దాతల అందరికి కూడా బాధితులు ఉదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసాచారి, రాష్ట్ర కార్యదర్శి వి బ్రహ్మానందం, జిల్లా కమిటీ సభ్యులు మండల సంఘ అధ్యక్షులు వడ్లమాను నారాయణచారి తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్‌ఛార్జీ ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో ఆదివారం పలువురు సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు టిడిపిలో చేరారు. గిద్దలూరు మండలం సంజీవరావుపేట సర్పంచ్ బుడత ఓబులమ్మ, కొంగలవీడు సర్పంచ్ పందనబోయిన లక్ష్మీప్రసన్న, జయరాంపురం సర్పంచ్ అంకాల లక్ష్మి నారాయణ, ఆదిమూర్తి పల్లె మాజీ సర్పంచ్ చెన్నబోయిన అరుణకుమారి, గడికోట మాజీ సర్పంచ్ మందగిరి రంగస్వామి, సంజీవరావుపేట ఉప సర్పంచ్ పాలూరి వెంకటేశ్వర్లు, జయరాంపురం ఉప సర్పంచ్ మోడీ రంగస్వామి, చెన్నబోయిన రామకష్ణ, కుసుమాల మహానంది యాదవ్ వైసీపీని వీడి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి వారికి టిడిపి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వీరి చేరిక గిద్దలూరు వైసిపికి కోలుకోలేని దెబ్బ అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం

మొక్కలు నాటాలి : జడ్జి

ప్రజాశక్తి - మద్దిపాడు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, పర్యావరణం కోసం మొక్కలు నాటాలని జిల్లా జడ్జి ఎ. భారతి తెలిపారు. మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎ.భారతి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సబ్ జడ్జి శ్యాంబాబు, ఎక్సైజ్ కోర్టు జడ్జి ఆర్.వెంకటేశ్వర శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అందరూ ఒక్క మొక్క నాటి దాన్ని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటారు. అనంతరం వెంకటేశ్వ స్వామి ఆలయాన్ని సందర్శించారు. మల్లవరాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని కమిటీ అధ్యక్షుడు మార్నేని కృష్ణారావు, గౌరవాధ్యక్షుడు కావూరి వాసు కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి బోయపాటి రవి, ట్రెజరర్ మన్నం శ్రీనివాస్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఎపెక్స్ మెంబర్,ఆడిటర్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న జడ్జీలు

'వందే భారత్'తో రైలు ప్రయాణంలో కొత్త శకం

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వందే భారత్ రైళ్ల ప్రవేశంతో ప్రయాణంలో కొత్త శకం ఆరంభమైందని కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. విజయవాడ నుంచి చెన్నైకి ప్రవేశపెట్టిన కొత్త వందే భారత్ రైలు మొదటి ప్రయాణంలో భాగంగా ఆదివారం మధ్యాహ్నం ఒంగోలు రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ దినేష్ కుమార్, పలువురు ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు వందే భారత్ రైలు కు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, వందే భారత్ రైలులో అనేక సౌకర్యాలు ఉన్నాయని,ప్రయాణ సమయం తగ్గుతుందన్నారు. ఒంగోలు ప్రాంత వాసులకు చెన్నై, తిరుపతి వెళ్లడానికి ఈ వందే భారత్ రైలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుం దన్నారు. ఒంగోలు రైల్వే స్టేషన్ లో 26 కోట్ల రూపాయల వ్యయంతో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ తన కుమారుడు, కుమార్తెతో కలిసి శింగరాయకొండ వరకూ వందేభారత్ రైలులో కలెక్టర్ ప్రయాణించారు.

శింగరాయకొండలో ఆగిన వందేభారత్ రైలు..

శింగరాయకొండ : కేంద్ర ప్రభుత్వం ప్రచారంపై శ్రద్ధ పెట్టింది. అందులో భాగంగా చిన్న చిన్న విషయాలపై కూడా ప్రచార హోరెత్తిస్తున్నారు. అందుకు ఉదాహరణగానే శింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో ఆదివారం వందే భారత్ రైలును ఆపారు. వాస్తవానికి శింగరాయకొండలో ఆ రైలుకు ఇక్కడ స్టాపింగ్ లేదు. కేవలం ప్రచారం కోసమే ఆపారు.రైలును ప్రజలు చూపించి పంపారు. తొలుత రెండో నంబరు ప్లాట్ పాంపై సభను ఏర్పాటు చేసి. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ రైలును ప్రారంభించిన దృశ్యాలను స్కీన్‌పై ప్రజలకు చూపారు. అనంతరం సభలో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల అధినేత డాక్టర్ కంచర్ల రామయ్య మాట్లాడారు. శింగరాయకొండ రైల్వేస్టేషన్ వసతుల విషయంలో చాలా వెనుకబడి ఉందన్నారు. తక్షణమే వసతులు కల్పిం చాలన్నారు. రైల్వేస్టేషన్లో కూర్చుంటే మురుగు కంపు కొడుతుందని పేర్కొనర్నారు. శింగరాయకొండలో అన్ని రైళ్ల చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఒంగోలు నుంచి వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శింగరాయ కొండకు వచ్చింది. రైలులో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా సంద ర్భంగా కలెక్టర్‌ను స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ శింగరాయకొండ రైల్వేస్టేషన్ అభివద్ధి గురించి అడిగి తెలుసుకున్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు. కందుకూరు డివిజన్ ప్రయాణికుల అసోసియేషన్ అధ్యక్షుడు కొత్తూరు విజయ్ ఒకుమార్, టిడిపి అధ్యక్షుడు వేల్పుల సింగయ్య తదితరులు పాల్గొన్నారు.



వందేభారత్ రైలుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్



శింగరాయకొండలో ఆగిన వందే భారత్ రైలు

టిడిపిలో చేరిన గిద్దలూరు జడ్‌పిటిసి

ప్రజాశక్తి - గిద్దలూరు

గిద్దలూరు జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్ వైసిపిని వీడి టిడిపిలో చేరారు. ఒంగోలులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ ఆధ్వర్యంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ సమక్షంలో ఆదివారం ఆపార్టీలో చేరాడు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మధుసూదన్‌యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జడ్‌పిటిసి మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ తాను వైసిపిని వీడి టిడిపిలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గిద్దలూరు పట్టణ నాయకుడు సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరినర జడ్‌పిటిసి

వైసిపి పతనానికి ఇది ఆరంభమే..

టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్

ప్రజాశక్తి - గిద్దలూరు

వైసిపి పతనం ప్రారంభమైందని, ఇది ఆరంభం మాత్రమేనని, వైసిపిని ఎవరూ కాపాడలేరని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ తెలిపారు. పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపం వద్ద టిడిపి నియోజకవర్గ స్థాయి విస్తత సమావేశం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇక వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో కొనసాగడానికి వీల్లేదన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు కష్టం వస్తే అధికార పార్టీకి చెందిన జడ్‌పిటిసి బుడతా మధుసూదన్ యాదవ్ వైసిపి వీడి టిడిపి లోకి రావడం అభినందనీయం అన్నారు. వచ్చే ఎన్నికలలో గిద్దలూరులో ముత్తుముల అశోక్ రెడ్డి తప్పక విజయం సాధిస్తారని తెలిపారు. ఎల్లపుడు ప్రజా సమస్యలపై పోరాటం చేసి వ్యక్తి అశోక్ రెడ్డి అని తెలిపారు. అశోక్‌రెడ్డిని గెలిపించోకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. మధుసూదన్ యాదవ్ చేరికతో జిల్లాలో గిద్దలూరు నుంచి మొదటి మార్పు మొదలైందని తెలిపారు. రాష్ట్రంలో బీసీల అభ్యున్నతికి కషి చేసిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ మాట్లాడుతూ బీసీల కోసం పుట్టిన పార్టీ టిడిపి తెలిపారు. గతంలో టిటిడి చైర్మన్‌గా బీసీ కులానికి చెందిన పుట్టా సుధాకర్‌యాదవ్ కు కేటాయించారన్నారు. అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి మాట్లాడుతూ 40 సంవత్సరాల ఎలాంటి మచ్చ లేకుండా రాష్ట్రాన్ని పరిపాలించిన వ్యక్తి చంద్రబాబునాయుడుఉ అని తెలిపారు. బీసీలకు పెద్ద పీట వేసిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని, టీడీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క బీసీపై ఉందన్నారు. పర్చూరు ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ చంద్రబాబుపై దాడి జరిగితే అది బీసీలపై జరిగినట్లేనని తెలిపారు.కనిగిరి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహ రెడ్డి మాట్లాడుతూ గొడ్డలిపోటు పాలన వద్దు ప్రజాపాలన ముద్దు అని తెలిపారు. -వచ్చే ఎన్నికలలో గొడ్డలిపోతూ కావాలా ప్రజా ప్రభుత్వం కావాలో తేల్చుకోవాలన్నారు. అనంతరం టిడిపిలో చేరిన జడ్‌పిటిసి, సర్పంచి, మాజీ సర్పంచులకు పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో దర్శి మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, టిడిపి చీరాల నియోజక వర్గ ఇన్‌ఛార్జి ఎంఎం. కొండయ్య టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతే లక్ష్యం

- బియ్యం అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి
- వన్ నేషన్, వన్ రేషన్ కార్డుతో అనేక ప్రయోజనాలు
- జిల్లా పౌర సరఫరాల అధికారి ఉదయ కుమార్

ముఖాముఖి



ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టతే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయ కుమార్ తెలిపారు. చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారు లందరికీ నిత్యావసర వస్తువులను అందిస్తున్నామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమంగా బయటకు వెళ్లకుండా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. వన్ నేషన్, వన్ రేషన్ కార్డుతో ప్రయోజనాలు ఉన్నట్లు తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలను డిఎస్ఓ ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

జిల్లాలో 6.55 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. 1392 చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదారను అందిస్తున్నారు. చౌకధరల దుకాణాల ద్వారా ఇబ్బందులు పడుతున్న ప్రజానీకం కోసం ఇంటి వద్దకే సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది.

ఇంటి వద్దకే సరుకుల పంపిణీ

ప్రజా పంపిణీ వ్యవస్థలో చౌక ధరల దుకాణాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వృద్ధులు, రోగులు, రోజువారీ కూలిల కోసం ప్రభుత్వం సార్టెక్స్, ఇతర నిత్యవసర సరుకులను మొబైల్ వాహనాల ద్వారా లబ్దిదారులకు అందించే విధానాన్ని 2021 ఫిబ్రవరిలో ప్రవేశపెట్టింది. అన్నపూర్ణ (ఏపిపి) కార్డులు 40, అంత్యోదయ (ఏఏవై) కార్డులు 33,120, తెల్ల రేషన్ కార్డులు 6.55,856 ఉన్నాయి.జిల్లాలోని కార్డుదారులకు 385 ఎండియు వాహనాల ద్వారా 194 మెట్రిక్ టన్నుల బియ్యం, 344 మెట్రిక్ టన్నుల చక్కెర 655 మెట్రిక్ టన్నుల కందిపప్పు విపిణీ చేస్తున్నాం. అంత్యోదయ అన్న యోజన కార్డుకు కిలో రూపాయి వంతున 15 కేజీలు, అన్నపూర్ణ కార్డు 10 కిలోల బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. తెల్లరేషన్ కార్డుకు కార్డులోని ఒక్కొక్క సభ్యుడికి 5 కిలోల బియ్యం కిలో రూ.1కే అందిస్తున్నాం. కందిపప్పు కిలో రూ.67, పంచదార రూ.13.50, అన్నపూర్ణ, ఏఏవై కార్డులకు పంచదార రూ. 17 చొప్పున పంపిణీ చేస్తున్నాం.

బియ్యం అక్రమార్కులపై ప్రత్యేక దృష్టి

రేషన్ బియ్యం బయటకు తరలిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాం. జిల్లా నలుమూలల, ఇతర జిల్లాల సరిహద్దుల వద్ద విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటీలు, రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో తనిఖీలు ముమ్మర చేశాం. గత 8 నెలల కాలంలో బియ్యం అక్రమంగా తరలిస్తున్న 67 వాహనాలను స్వాధీనం చేసుకొని 6ఏ కేసులు నమోదు చేశాం. సుమారు 1500 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నాం.

వన్ నేషన్, వన్ రేషన్‌తో ప్రయోజనం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వన్ నేషన్, వన్ రేషన్ కార్డు కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. దేశ ప్రజలు ఎవరైనా ఎక్కడ నుంచి అయినా రేషన్ పొందే అవకాశం ఈ పథకం కల్పిస్తోంది. జిల్లాలో చీమకుర్తి, మార్కాపురం, పొదిలి ప్రాంతాలకు వివిధ పనుల కోసం వలస వచ్చిన కార్మికులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నాం. ఆయా ప్రాంతాలలో ఎండియు వాహనాల ద్వారా సరుకుల పంపిణీ జరుగుతోంది.